క్లుప్తంగా

డాక్టర్ వరప్రసాద్‌కు బంగారు నంది అవార్డు



నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ వరప్రసాద్

కంచరపాలెం: కంచరపాలేనికి చెందిన జైభీమ్ దిశా ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, సోషల్ వర్కర్ డాక్టర్ మాముడూరి వరప్రసాద్‌ను బంగారు నంది అవార్డు వరించింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ జాతీయ చైర్మన్ వి.ఆర్.శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ బంగారు నంది అవార్డ్స్–2023 ప్రదానోత్సవంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ సామాజిక, కళా, రాజకీయ రంగాల్లో ఉత్తమ సేవలకు గానూ ఈ అవార్డు లభించినట్లు తెలిపారు. రాష్ట్ర తెలుగు, సంస్కృతి అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు. తన సేవలకు గుర్తింపుగా వచ్చిన అవార్డుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కొండవాలులో తాగునీటి సమస్యపై వినతి



ఏఈ మోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న గంకల అప్పారావు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు కోరారు. ఈ మేరకు మంగళవారం జోన్–5 తాగునీటి విభాగం అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ) మోహన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వేసవి దృష్ట్యా వార్డులో పర్యటించి నీటి సమస్యలను గుర్తించామని అప్పారావు తెలిపారు. తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టాలని, కుళాయిలకు హెడ్‌లు అమర్చాలని, నీటి సరఫరా వేళలు సక్రమంగా ఉండేలా చూడాలని విన్నవించారు. జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణతో కలిసి వార్డులో పర్యటించి నీటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఈ మోహన్ తెలిపారు.

2 కిలోల గంజాయి స్వాధీనం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. బర్మా క్యాంప్‌కు చెందిన రాయ సత్యనారాయణ మంగళవారం 2 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం మేరకు కైలాసపురం మధుసూదన్‌నగర్ వద్ద కంచరపాలెం పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుండి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

23న నడక పోటీలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న స్థానిక వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో వాకర్ లంకా ఆదినారాయణ స్మారక నడక పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్.వెంకట సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 6 గంటల నుంచి 31–40, 41–50, 51–60, 61–70, 71–80, 81–90 వయసుల వారీగా పోటీలు జరుగుతాయన్నారు. పాల్గొనే వారు 83091 57522 నంబర్‌కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు మే 1న నిర్వహించే ప్రత్యేక సమావేశంలో బహుమతులు అందిస్తామని చెప్పారు.

పారిశుధ్య నిర్వహణ.. అంతంత మాత్రం

- జోన్–5లో డస్ట్ బిన్ల కొరత
- తుప్పుపట్టిన చెత్త డబ్బాలే దిక్కు
- మెరుగైన పారిశుధ్యంపై అధికారుల అశ్రద్ధ



రక్షణగిరి రోడ్డులో పాడైన డస్ట్ బిన్ వద్ద చెత్తకుప్ప(ఫైల్)



దుర్గానగర్‌లో మూలకు చేరిన వీల్ బిన్స్



56వ వార్డులో తుప్పుపట్టిన పుష్‌కార్టులు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5లో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. జోనల్ కార్యాలయ పరిధిలో పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. అధికారుల అశ్రద్ధతో పారిశుధ్య పనులు నామమాత్రంగానే జరుగుతున్నాయి. ప్రజారోగ్యానికి సంబంధించి పారిశుధ్య సిబ్బంది కొరత కంటికి కనిపిస్తున్నా.. జీవీఎంసీ పాలకవర్గం కొత్త వారిని నియమించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్డుకు సంబంధించిన పారిశుధ్య సిబ్బందితో మొత్తం పనులు చేయించి సరిపెడుతున్నారు. అంతవరకు ఎలా ఉన్నా.. పారిశుధ్య సామగ్రి విషయంలో అధికారుల నిర్లక్ష్య ధోరణి బయటపడుతోంది. ఒక్కో వార్డుకు సంబంధించిన పారిశుధ్య సిబ్బందితోపాటు తడి, పొడి చెత్త సేకరణ నుంచి కాలువలు, గెడ్డల్లో పూడిక తీసే వాహనాలు తుప్పుపట్టి మూలకు చేరాయి. ప్రధాన రహదారుల్లో డంపర్ బిన్లు, వీధుల్లో పుష్‌కార్టులు పాడై నిర్లక్ష్యంగా రోడ్డున పడ్డా.. వాటికి మరమ్మతులు చేయించే నాథుడు కనిపించడం లేదని జోన్ ప్రజలు ఆరోపిస్తున్నారు.

వీధులు, రహదారుల్లో చెత్తకుప్పలు..

ఒక్కో వార్డుకు సంబంధించి కాంపాక్ట్ బిన్లు(6), డంపర్ బిన్లు(8), పుష్‌కార్టులు(ఫోర్ బిన్లు)(12)–(రెండు బిన్లు)(8), వీల్‌బార్స్(10) ఉండాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరిస్తుండటంతో వీటిని అంతంత మాత్రంగానే వినియోగిస్తుండటంతో సంఖ్య తగ్గింది. కొత్త వాటి జాడలేకపోయిన ఉన్న బిన్లు తుప్పుపట్టి మూలకు చేరాయి. దీంతో వీధులు, ప్రధాన రహదారుల్లో సాయంత్రం, రాత్రి వేళల్లో చెత్తాచెదారం దర్శనమిస్తోంది. పాడైన పుష్‌కార్ట్‌ల్లో చెత్త వేయడంతో వీధులు అధ్వానంగా మారుతున్నాయి. జోనల్ కమిషనర్ స్పందించి ఆయా వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు తగు చర్యలు తీసుకోవాలని జోన్ ప్రజలు కోరుతున్నారు.

కొత్త వాటికి టెండర్లు పిలిచాం



జోన్–5కు సంబంధించిన వార్డుల్లో తుప్పుపట్టిన డస్ట్ బిన్లను తొలగించాలని స్పందన కార్యక్రమంలోనూ, వార్డు పర్యటనల్లో నా దృష్టికి వచ్చింది. టెండర్లు పిలిచి కాంపాక్ట్ బిన్లు, పుష్‌కార్ట్‌లు, డంపర్ బిన్లు, వీల్‌బిన్లు కొత్తవి తయారు చేయిస్తున్నాం. పనులు పూర్తయితే వార్డు జనాభా ఆధారంగా పంపిణీ చేస్తాం. వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేటట్లు శానిటరీ అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్నాం.

–ఆర్.జి.వి.కృష్ణ, జోన్–5 కమిషనర్, జీవీఎంసీ

త్వరలోనే అర్హులందరికీ సొంతిళ్లు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- ఏఎస్సార్ నగర్ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న ఏఎస్సార్ నగర్ వాసులు



మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు. చిత్రంలో జోన్-5 కమిషనర్ కృష్ణ

తాటిచెట్లపాలెం: అర్హులందరికీ సొంత ఇల్లు ఉండాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు హామీ ఇచ్చారు. 45వ వార్డు తాటిచెట్లపాలెంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో మంగళవారం ఏఎస్సార్ నగర్ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల లబ్ధిదారులందరికీ త్వరలోనే గృహాలు ఇస్తామని, ఇవి సరిపడక పోతే వేరే చోట అయినా సరే తప్పకుండా ఇళ్లు నిర్మించి అందిస్తామని తెలిపారు. కార్పొరేటర్ కంపా హనోకు మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున అర్హులందరికీ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తానని, త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు జరుగుతాయని చెప్పారు. అర్హుల ఎంపిక కోసం కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, పీడీ పాపునాయుడు, ఏపీడీ శైలజ, సీడీవో పద్మావతి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ వెంగళరావు, పార్టీ నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, నానిబాబు, నాయుడు, బాబూరావు, మహేష్, మాతా ఈశ్వరరావు, ఆదిలక్ష్మి, సన్నీ, తవుడమ్మ, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్తు'



వైఎస్సార్ నగర్‌లో కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ హనోకు, పైడి రమణ

తాటిచెట్లపాలెం: నియోజకవర్గంలో ఇంటింటా జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం 45వ వార్డు 256 సచివాలయం పరిధిలోని వైఎస్సార్ నగర్ తదితర కాలనీల్లో ఈ కార్యక్రమం చురుగ్గా నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ కంపా హనోకు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాలు సేకరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న మంచిని స్థానికులకు వివరించి వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ వెంగళరావు, సచివాలయ కన్వీనర్ నేపాల్ శ్రీను, సీనియర్ నాయకులు ఆదిలక్ష్మి, సన్నీ, నాయుడు, దుర్గా, బాబూరావు, నాని, యేసు, మహేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే సీఎం లక్ష్యం



బాపూజీనగర్‌లో మహిళలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ కామేశ్వరి

కంచరపాలెం: ప్రతి క్షణం ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 47వ వార్డు కంచరపాలెం అంబేడ్కర్ ఎస్టేట్, బాపూజీనగర్ ప్రాంతాల్లో మంగళవారం కార్పొరేటర్ కంటిపాటు కామేశ్వరితో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలందరి సహకారం, చల్లని దీవెనలతో 2024లో మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, విజయ్, ముక్క రమణ, సురేష్, కంటిపాము గురువోజీ, రాఘవులు, అనిల్, చందు, కనకరాజు, కృపా, సాయి, అజయ్, భోగి, శంకర్, వాసు, నరసింగ్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ



ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన హర్షవర్ధన్ రెడ్డి

ఏయూక్యాంపస్: మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ పెరుగుతోందని జగనన్న సచివాలయం, గృహసారథి ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిసి ఉత్తరాంధ్ర జిల్లాల వివరాలు వివరించారు. తొమ్మిది రోజులుగా చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్‌కు ప్రజా స్పందన పెరుగుతోందని వివరించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.

40 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

మర్రిపాలెం: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కంచరపాలెం పరిధిలో ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. వారం రోజులుగా చేస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 40 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం కంచరపాలెం మెట్టు, ఊర్వశి జంక్షన్, ఎన్ఏడీ, బిర్లా జంక్షన్, ఎన్ఎస్‌టీఎల్, జ్ఞానాపురం కూడళ్లలో ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు పాపారావు, వాసుదేవరావు, ఉల్‌హక్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అప్పారావు మాట్లాడుతూ వారం రోజులుగా 40 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. అందులో 19 మందిని మంగళవారం 3వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని, వారికి రూ.39 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహన చోదకులకు హెచ్చరికలు జారీ చేశామన్నారు.

దశాబ్దాలుగా ఉత్తరాంధ్రకు అన్యాయం



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

తాటిచెట్లపాలెం: దశాబ్దాలుగా ఉత్తరాంధ్రకు అడుగడుగునా అన్యాయం జరుగుతోందని, తక్షణమే ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. రామాటాకీస్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రకు న్యాయం జరగాలంటే తక్షణమే తమ డిమాండ్లు పరిష్కరించాలన్నారు. విశాఖను తక్షణమే రాజధానిగా అమల్లోకి తేవాలని, బుందేల్‌ఖండ్ తరహాలో ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, పార్టీలకతీతంగా బిడ్‌ను అడ్డుకోవాలని, విశాఖపట్నం రైల్వే జోన్ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, గాయకులు

తాటిచెట్లపాలెం: శారద స్వర సంగమం ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. లెఫ్టినెంట్ లోకేష్ నిర్వహణలో గాయనీ గాయకులు తెలుగు, హిందీ గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. కళారంగ ప్రముఖులు కొణతాల రాజు, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్ట్, ఆర్టిస్ట్ డైరెక్టర్ సన్‌మూర్తిలు పలువురు గాయనీ గాయకులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందాల ఆడ బొమ్మ.. గిచ్చి గిచ్చి చంపమాకు హాయ్‌రా.. పాపా కహతే హై బడా నామ్ కరేగా వంటి వివిధ గీతాలతో ప్రేక్షకులను రంజింపజేసి, వారి మన్ననలు పొందారు. కార్యక్రమంలో గాయకులు వి.రామ్‌కుమార్, ధనలక్ష్మి, సాత్విక, శారదాలతా నాయుడు, స్వరూప, రవిచంద్ర, గీత, కవిత, వెంకటేష్‌లతోపాటు డాక్టర రాజేంద్రప్రసాద్, డాక్టర్ లక్ష్మణరావు, ఫణిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కెమ్‌ఫెస్ట్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ



కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరమణతో కెమ్‌ఫెస్ట్ విజేతలు

మురళీనగర్: విజయనగరం ఎంవీజీఆర్ కాలేజీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కెమ్‌వెర్స్–2023 టెక్‌ఫెస్ట్‌లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థులు ప్రతిభ చూపారు. పోస్టర్, పేపర్ ప్రజంటేషన్, క్విజ్ అండ్ క్రాస్ వర్డ్ విభాగాల్లో పాల్గొని సత్తా చాటారు. పెట్రోకెమికల్స్ ఫస్టియర్ విద్యార్థులు బి.వర్ష, బి.మాధురి, ఎం.మంగాదేవి పోస్టర్ ప్రజంటేషన్‌లో తృతీయ బహుమతి, బి.వర్షిత్, బి.మాధురి, ఎల్.నీహారికలతోపాటు ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగం ఎల్.మురళీకృష్ణ, జె.శ్రీవంశీ క్విజ్‌లో ప్రథమ బహుమతి, బి.మాధురి క్రాస్‌వర్డ్‌లో ద్వితీయ బహుమతి, ప్రొడక్షన్ ఆఫ్ గ్రీన్ కెమికల్స్ కేటగిరిలో బి.ప్రియ, ఎల్.తేజసాయి పేపర్ ప్రజంటేషన్‌లో మొదటి స్థానం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్‌తోపాటు డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, అధ్యాపకులు అభినందించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు

మహారాణిపేట: జిల్లా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘాల కార్యాచరణ సమితి(అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌జీవో హోంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ(అమరావతి) రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఉద్యోగ సంఘ నాయకులతో చర్చలు జరిపి.. తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమరావతి జేఏసీ కో–చైర్మన్, ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ త్రినాథరావు, ఏపీ భాషా పండితుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణమూర్తి, ఏపీ ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.మూర్తి, కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శారదారావు, ప్రధాన కార్యదర్శి జగదీశ్వరరావు తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

అంతరవిభాగాల ఫుట్‌బాల్ విజేత మెకానికల్ జట్టు



విశాఖ స్పోర్ట్స్: ఈకోర్రైల్వే అంతర విభాగాల స్పోర్ట్స్ మేళాలో భాగంగా నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో మెకానికల్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం రైల్వేఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆపరేటింగ్ జట్టుపై ఒక గోల్ తేడాతో విజయం సాధించింది. సెమీస్‌లో ఆపరేటింగ్ జట్టు టీఆర్‌డీ జట్టుపైన, మెకానికల్ జట్టు సివిల్ ఇంజినీరింగ్ జట్టుపైన విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. క్రికెట్ నాకవుట్ మ్యాచ్‌లో మెకానికల్ జట్టు 56 పరుగుల తేడాతో సిగ్నల్స్ టెలికాం జట్టుపై విజయం సాధించింది. మెకానికల్ జట్టు ఐదు వికెట్లకు 177పరుగులు చేయగా సిగ్నల్స్ టెలికాం జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 121 పరుగులే చేసింది.

ముగిసిన 10వ తరగతి పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. చివరి రోజైన మంగళవారం ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు జరిగిన పరీక్షకు 1,023 మంది నమోదు చేసుకోగా.. 948 మంది హాజరయ్యారు. 92.7 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో చంద్రకళ తెలిపారు.

సత్తాచాటిన ఏఎంసీ జట్లు

విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ హెల్త్‌సైన్సెస్ అంతర కళాశాలల గేమ్స్ పోటీల్లో ఏఎంసీ ఫుట్‌బాల్, టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ఈ పోటీలు నెల్లూరులోని నారాయణ డెంటల్ కళాశాలలో జరిగాయి. ఫుట్‌బాల్ జట్టుకు రాహుల్, బాల్ బ్యాడ్మింటన్‌కు శంకర్, టెన్నిస్ జట్టుకు ఆదర్శ్ కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్స్ మన్మథరావు, రాజేంద్రప్రసాద్ ఆయా జట్లను అభినందించారు.

అనాథాశ్రమానికి వితరణ



గీజర్ అందిస్తున్న గీతాభాను, గంగరాజు దంపతులు

మురళీనగర్: మాధవధార కేర్ అండ్ లవ్ చెవిటి, మూగ, మానసిక దివ్యాంగ అనాథ పిల్లల ఆశ్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ సభ్యురాలు గీతాభాను, గంగరాజు దంపతులు వారి పిల్లలు రీతు, రిక్కిల పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. వారి ఆర్థిక సాయంతో అనాథ పిల్లలకు అవసరమైన 15 లీటర్ల సామర్థ్యం గల క్రాంప్టన్ గ్రీవ్స్ గీజర్‌ను ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు శేషామణి, కార్యదర్శి సనపల పుష్పలత, గీతాభాను, సుబ్బలక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి పాల్గొన్నారు.

సామాన్యులపై ధరల భారం



అక్కయ్యపాలెంలో ప్రచారం చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

తాటిచెట్లపాలెం: సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలపై ధరల భారం తగదన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నల్లధనాన్ని వెనక్కి రప్పించి, ప్రతి పేద కుటుంబానికి రూ.15 లక్షలు అకౌంట్‌లో జమచేస్తామని చెప్పారని, నేటి వరకు అది అమలు కాలేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలిస్తామన్న హామీ కూడా నెరవేరలేదన్నారు. సీపీఐ నాయకులు రావికృష్ణ, కాంగ్రేకు రాము, అబ్దుల్ రజాక్, వై.వెంకట్, ఎం.ఎ.ఖాన్, వి.శ్రీను పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'షేడ్స్ ఆఫ్ వైజాగ్'



పెయింటింగ్స్‌ను తిలకిస్తున్న సీఎండీ హేమంత్

బీచ్‌రోడ్డు: మన సంప్రదాయలు, సాంస్కృతిని ఛాయాచిత్రాలు చాటుతాయని హిందుస్తాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ తెలిపారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మంగళవారం బీచ్ రోడ్డులోని హవామహల్‌లో షేడ్స్ ఆఫ్ వైజాగ్ పేరుతో ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. దీనిని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, రాజుల పాలన, బ్రిటీష్ వారి అరాచక పాలనను చిత్రకారులు గీసిన చిత్రాల ద్వారానే చాలా వరకు తెలుసుకున్నామన్నారు. వైజాగ్‌లో వారసత్వ నిర్మాణాల రూపాలను గీసిన తీరు అద్భుతంగా ఉన్నాయని ఆర్టిస్ట్ నరేష్ మెహతా అన్నారు. ఈ ప్రదర్శన బుధ, గురు వారాల్లో కూడా అందుబాటులో ఉంటుంది. హవామహల్ రాజమాత మయంక్ కుమారిదేవి, సందర్శకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత కోచింగ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణారావు, విద్యార్థులు

కంచరపాలెం: కంచరపాలెం బీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ బుధవారం నుంచి పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలిసెట్)–2023కి ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణారావు తెలిపారు. కార్యాలయ భవనం వద్ద మంగళవారం ఉచిత కోచింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామని, ఉత్సాహవంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 98665 62778కు కాల్ చేసి విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని అయన కోరారు.